




ఇస్కాన్ వంటశాలలో తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై ఓ నందన్ స్నేహ నగర్ రెండవ వీధి ప్రాంతంలో కాంపాక్ట్ ద్వారా పారిశుధ్య నిర్వహణ పనులను సోమవారం పర్యవేక్షించారు ఇస్కాన్ వంటశాలను కమిషనర్ తనిఖీ చేశారు. వంటశాలలో ఆహార పదార్థాల తయారీ విధానం, నాణ్యత, వివిధ ప్రమా ణాలను పరిశీలించారు. డివిజన్ పరిధిలోని ప్రధాన డ్రెయిను కాలువ నిర్వహణ తీరును కమిషనర్ పరిశీలించారు. కాలువలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వేయ కుండా నిరంతరం పర్యవేక్షించి, మురుగు నీటి సరఫరా సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



వంటగదిని పరిశీలిస్తున్న దృశ్యం

'సింహపురి'లో ప్రభుత్వం ప్రయోగం..!

ఒకప్పుడు ప్రశాంతతకు నిలయమైన సింహపురిలో నేడు వరుస హత్యలు.. దొంగతనాలు..రౌడీయిజం.. డాన్లు..రాజకీయ నేరస్తులు.. ఒక్కటేమిటి రాష్ట్రంలో నెల్లూరు పేరు మారుమోగు తోంది..నిత్యం మీడియాలో పతాకస్థాయిలో నెల్లూరు నేర చరిత్ర చర్చిసాగుతోంది.. నెల్లూరు వైపు చూసే ప్రజలు ఏం జరుగుతుంది. అనుమానాలు రెక్కిస్తున్నారు. ఇలాంటి సమయంలో రాష్ట ప్రభుత్వం ప్రయోగం చేస్తున్నట్లు కనిపిస్తున్నాయి. తొలిసారి మహిళా ఎస్‌పిని నియమించింది. ఎఎస్‌పి, డిఎస్‌పి మూడు కీలకమైన స్థానాల్లో మహిళలకు అవకాశం కల్పిం చారు... క్లిష్టమైన సమయంలో ముగ్గురు మహిళా అధికారులకు ఇది సవాల్‌గా నిలిచింది. జిల్లాతోపాటు, రాష్ట్రమంతా ప్రభుత్వం నిర్ణయం పట్ల ఆసక్తిగా గమని స్తున్నట్లు కనిపిస్తోంది. క్రైమ్‌లో అగ్రబాగంలోని సింహపురిలో ప్రశాంతత నెలకొల్పుతారా లేదా చూడాలి..

- క్రైం అడ్డాలో ప్రశాంతత నెలకొల్పేనా
- ముగ్గురు మహిళా పోలీసు అధికారులకు సవాళ్లు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సింహపురి ఇప్పుడు రాష్ట్రంలోనే క్రైంలో ప్రథమ స్థానంలో కనిపిస్తోంది.కొద్ది రోజులుగా మీడియాలో పతాక స్థాయిలో కథనాలు వస్తున్నాయి, రాజకీయ విభేదాలతోపాటు, రౌడీమూకలు, గుండాలు, పెత్తనం జిల్లాలో ఎక్కువైపోయింది. ప్రధానంగా నెల్లూరు నగరం క్రిమినల్స్‌కు అడ్డాగా మారిపోయింది. గంజాయి, డ్రగ్స్, మాఫియా హల్‌చల్ చేస్తుంది. ఇక్కడ ఎస్‌పిలుగా భూపతిబాబు, శ్రీనివాసులురెడ్డి, పూర్ణచంద్రరావు, రాజేంద్ర నాథ్‌రెడ్డి , పిహెచ్‌డి రామకృష్ణ వంటి ఎందరో అధికారులు సమర్ధవంతంగా పనిచేశారు. ఆ రోజుల్లో క్రైమ్‌పై ఉక్కుపాదం మోపారు. టిడిపి ప్రభుత్వంలో అరాచక శక్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందనే ప్రచారం ఉంది. ఇవే కాకుండా ఎర్రచందనం, గంజాయి, డ్రగ్స్ రవాణాకు నెల్లూరు కేంద్రంగా ఇటీవల కాలంలో మారిపోయింది.కొద్ది రోజులుగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్, కోవూరు ఎంఎల్‌ఎ,



ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎఎస్‌పి డిఎస్‌పి

మాజీ ఎంఎల్‌ఎలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వివాదం. శ్రీకాంత్ వివాదం, కోవూరు నిడిగుంట అరుణ ఉదంతం. కుబేరా కుంభకోణం,తోపాటు నిత్యం జిల్లాలో ఎక్కడో ఒక చోట దారుణ హత్యలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల పనిచేసిన ఎస్‌పి కృష్ణకాంత్ నేరాలు అదుపు చేయడంతో విఫలమయ్యారనే ప్రచారం చేశారు. రాజకీయ నేతల జోక్యం ఎక్కువ కావడం, రాజకీయనేతలు, ప్రజా ప్రతినిధుల చేతిలో పోలీసులు కీలుబొమ్మలుగా మారారనే విమర్శలున్నాయి. ఇలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది.

ముగ్గురు అధికారులకు సవాల్...!

నెల్లూరులో క్రైమ్ రేటు భారీగా పెరగడానికి ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలే ప్రధాన కారణంగా తెలుస్తున్నాయి. రాజకీయాల్లోకి రౌడీలు, గుండాలు, నేరస్తులు ప్రవేశించారు. వీరికి రాజకీయ నేతలు వత్తాసు పలకడం, పోలీసులు ఏం చేయలేని పరిస్థితుల్లోనే క్రిమినల్స్ రెచ్చిపోతున్నారు. నెల్లూరు రాజకీయ చరిత్రలో ఇలాంటి పరిస్థితులు ఏనాడు కనిపించలేదు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం నెల్లూరు శాంతిభద్రతలు గాడిలో పెట్టడానికి ఏం చేస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు. జిల్లా చరిత్రలో తొలిసారిగా మహిళా ఎస్‌పిగా డాక్టర్ అజితా వేజెండ్లను నియమించింది. ఇప్పటికే అదనపు ఎస్‌పిగా సౌజన్య, నెల్లూరు నగర డిఎస్‌పిగా సింధుప్రియ పనిచేస్తున్నారు. జిల్లా చరిత్రలో ఒకేసారి ముగ్గురు మహిళా పోలీసు అధికారులు ఒకే చోట పనిచేయడం అరుదైన సంఘనటగా చెప్పొచ్చు. ఎవరైనా చట్టం ఒక్కటే దీనిని ఎలా అమలు చేస్తారో చూడాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు అందరి దృష్టి ముగ్గురు మహిళా అధికారుల పనితీరుపైన పడింది. క్లిష్టమైన సమయంలో మహిళా పోలీసు అధికారులతోనే నెల్లూరు శాంతిభద్రతలు గాడిలో పెట్టాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. నెల్లూరు రాజకీయాలు తట్టుకోవడం సాధారణ అధికారులకు సాధ్యం కాదు. ఇలాంటి పరిస్థితుల్లో కాస్త కఠినంగా వ్యవహరిస్తేనే నెల్లూరు నగరంలోని రౌడీ మూకలు, వైట్ కాలర్ నేరగాళ్లు, స్మగ్లర్లు, ఆట కట్టించగలరు. ఇప్పటికే పోలీసు అధికారులు తీసుకున్న కొన్ని చర్యల వల్ల గతం కంటే కొంత శాంతిభద్రతలు మారినట్లు కనిపిస్తున్నాయి.. మహిళా అధికారుల చేతే సమర్ధవంతంగా పనిచేయించి, ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు తమ సత్తా చాటుకోవాలని చూస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. పోలీసు భయం ఇటీవల కాలంలో తగ్గిపోయింది. ఇందుకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. నిజాయతీ, నిబద్ధత, నికార్సుగా వ్యవహరిస్తేనే ఇది సాధ్యమవుతోందని ప్రచారం ఉంది. ఆ దిశగా మహిళా అధికారులు ఏం చేస్తారో ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.



నాటికను ప్రదర్శించిన విద్యార్థులు

జాతీయ సమైక్యత నాటికకు బహుమతి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు +జాతీయ సమైక్యతపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని కైవసం చే సుకుంది. వివరాల్లోకి వెళితే....కళా ఉత్సవ 2025 జిల్లాస్థాయి నాటిక పోటీల ను ఇటీవల పల్లిపాడు డైట్ కళాశాలలో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించారు. ఈ మేర కు మండలంలోని వరిగొండ జిల్లా పరిష త్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నాటిక జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని అందుకున్నారు. టీచర్ వై. శ్రీ నివాసులు రెడ్డి బయాలజీ దర్శకత్వంలో తొమ్మిదవ త రగతి చదువుతున్న విద్యార్థులు ఆర్. అశోక్, నితిన్, బాషా, రామ్, తేజ్ లు నటించారు. మతసామరస్యంపై అత్యంత అ ద్భుతంగా ప్రదర్శించిన విద్యార్థులను, ఈ నాటికకు దర్శ కత్వం వహించిన ఉపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డిని అటు హైస్కూల్ సిబ్బంది, ఇటు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

తల్లిదండ్రులకు బాలుడు అప్పగింత

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:కనబడకుండా పోయిన బాలుడిని, వాళ్ల తల్లిదండ్రులకు, అధికారులు అప్పగించినట్లు సోమవారం జిల్లా బాలల సంరక్షణ అధికారి బి. సురేష్ తెలిపారు. తప్పిపోయిన బాలుడిని, రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ముందు హాజరపరిచి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. స్థానిక కావేరి నగర్ కు చెందిన రాము కుమారుడు, ఎం.సాయి గూడూరు లోని ఎస్‌ఆర్ కె కళాశాలలో గతంలో ఇంటర్ చదువుతుండేవాడని తెలిపారు. ఈ క్రమంలో ఆ బాలుడు కనిపించడం లేదని, తమ సంరక్షణ కార్యాలయానికి తెలియజేశారని తెలిపారు. తాము ఆ బాలుడు ఆచూకీ కోసం, వాళ్ల తల్లిదండ్రులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.గతంలో ఇంటర్ చదువుతున్న క్రమంలో బంధువుల ఇంటికి అని వెళ్లి, అక్కడ నుండి శ్రీకాళహస్తి లోని హిజ్రాలతో కలిసి ఫ్రెండ్ షిప్ చేసినట్లు తెలిపారు. రూరల్ తహశీల్దార్ వద్ద బాలుడ్ని హాజరపరిచినట్లు తెలిపారు. విచారణ జరిపిన అధికారులు బాలుని, తల్లిదండ్రుల వద్దకు అప్పగిం చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ తహశీల్దార్ కృష్ణ ప్రసాద్, పోలీస్ సిబ్బంది, జిల్లా బాలల సంరక్షణ సిబ్బంది తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఆశా వర్కర్లకు కనీసవేతనం అందజేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు:కూటమి ప్రభుత్వం ఆశాలకు కనీస వేతనాలు అందజేయాలని, సమాజంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశాల నియామకం పెంపుదల చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా 6వ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి ముఖ్యఅతిధిగా హాజ రయ్యారు. ఈ మహాసభల ప్రారంభోత్సవానికి ముందుగా సిఐటియు జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశాలకు ప్రభుత్వం 5జికి సపోర్టు చేసే మొబైల్స్ అంద జేయా లన్నారు.వైద్య ఆరోగ్యశాఖ ఎఎన్‌ఎంల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసిన సమయంలో వారు శిక్షణ తీసుకొని ఉన్న ఆశాలకు వెయిటేజీ మార్కులు ఇవ్వాలన్నారు. వాస్తవానికి ఆశాలను కార్మికులుగా గుర్తిం చాల న్నారు. ఆశాలుగా పనిచేస్తున్న వారు మరణించిన సమయంలో మట్టి ఖర్చులకు నగదు అందజేయాలన్నారు. వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ఆలోచనలు చేసి ఆశాలందరికీ ఇన్సూరెన్స్ , పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఆశాలు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడారని, ఆ సమయంలో రాష్ట్రంలో 76 మంది ఆశాలు



మాట్లాడుతున్న ఆశావర్కర్ల రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి

మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాము నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాల వల్లనే ఆశాలకు గౌరవ వేతనంగా రూ.10వేలు అందజేసేందుకు ప్రభుత్వం అంగీకరిం చిం దన్నారు. అంతే కాకుండా ఆశాల రిటైర్మెంట్ వయ స్సును 62 సంవత్సరాలకు పెంచుకోగలి గామన్నారు. గ్రాట్యూటీగా లక్షా యాభైవేల రూపాయలను ,180 రోజుల మెటర్నిటీ సెలవులు పోరాటం చేసి సాధించుకు న్నామన్నారు. అదే ఉత్సాహంతో సమరశీల పోరా టాలు నిర్వహించి మిగిలిన సమస్యల న్నిం టిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించు కొనేందుకు ఈ మహాసభలో చర్చలు నిర్వహిం చుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించు కుంటామన్నారు. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా కె.విజయలక్ష్మి, కె.లక్ష్మి, భువనేశ్వరి, మినిట్స్ కమిటీ సభ్యులుగా కె.లత,సిహెచ్ సౌందర్యలు వ్యవహరించారు. మహాసభ చివరిలో జిల్లా నూతన కమిటీని సభ్యులందరూ ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీలో ఏపి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, అధ్యక్షురాలు ఎస్.మధుసూధన, జిల్లా కోశాధికారి డి.మేరీ, ఉపాధ్యక్షురాలు కె. విజయలక్ష్మి, కె.లక్ష్మి, సహాయ కార్యదర్శి పి.వసుంధ్ర, జి.వజ్రమ్మ, టి.రాణి, 14 మంది కమిటీ సభ్యులు ఎన్నికైనట్లు ప్రకటించారు.

'సుజల' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్ :నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సుజల సురక్షిత తాగునీటి పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వై.ఓ నందన్ సూచించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ వై.ఓ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను అందుకున్నారు. వెంకటేశ్వరపురం వేప దొరువు పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణం నుంచి 15 రిమోట్ డిస్పెన్సరీ కేంద్రాల ద్వారా ప్రతిరోజు సుమారు మూడు లక్షల లీటర్ల సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. నమోదు చేసుకున్న మొదట 100 మంది లబ్ధిదారులకు 50 రూపాయల రిజిస్ట్రేషన్, 20 రూపాయల రీఛార్జ్ ఉచితంగా అందజేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు..

సోషల్ మీడియా దుర్వినియోగం

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్:జనసేన పార్టీని అప్రతిష్టపాలు చేసేందుకు నేతలపై సోషల్ మీడియా దుర్వినియోగం జరుగుతోందని నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. గుణుకుల కిషోర్, శింగం శెట్టి శ్రీరామ్, పావుజెన్నీ చంద్ర శేఖర్ రెడ్డి తదితరులతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ వృద్ధి చెందాలంటే పాత, కొత్త నాయకులు ఇద్దరూ అవసరమని అన్నారు.పార్టీ ప్రారంభం నుండి ఉన్నవారికి గౌరవం ఇవ్వాలని, అదే విధంగా పార్టీలో కొత్తగా చేరినవారు పార్టీ బలోపేతం కోసం పనిచేయాలన్నారు.





ఎంఎల్‌ఎ ఇంటూరిని కలిసిన 'చిలకపాటి'

ప్రజాశక్తి-కందుకూరు:తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకూ మంచి గుర్తింపు ఉంటుందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కందుకూరు నియోజకవర్గానికి చెందిన చిలకపాటి మధుబాబు, శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ ముందుగా చిలకపాటి మధుబాబుకు అభినందనలు తెలియజేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్‌గా మంచి పేరు తెచ్చుకోవాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.చిలకపాటి మధుబాబు మాట్లాడుతూ, తనకు విశ్వబ్రాహ్మణ డైరెక్టరుగా అవకాశం కల్పించడంలో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి కృతజ్ఞతలు తెలుపుతూ కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం ఎమ్మెల్యే ఏ బాధ్యత అప్పజెప్పినా సమర్థంగా నిర్వహిస్తానని తెలియజేశారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు మధిర మధు, మహర్షి శ్రీను, బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీను, పతకమూరి వరప్రసాద్, రావూరి రామకోటయ్య, పూజల వెంకట్రావు పోలుగంగు కృష్ణ,ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గేదెలకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-కందుకూరు :నియోజకవర్గంలోని 78,400 పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఈనెల 15.వ తేదీ నుండి వచ్చే నెల 15. వరకు గాలికుంటు నివారణ టీకాలు ఉచితంగా పశుసంవర్ధక శాఖ వైద్యులు వేస్తారని, వీటిని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఎంయల్‌ఎ కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ బాధ్యుల ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాలకు సంబంధించిన ప్రచార పోస్టర్ను సోమవారం ఆవిష్కరించారు.

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేయించి, విలువైన పశుసంపదను కాపాడుకోవాలని వెటర్నరీ ఏడి డాక్టర్ ఎంతోటి చెన్నకేశవులు తెలిపారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెం లో సోమవారం గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాను స్థానిక సర్పంచ్ సాదు శ్రీలత వేసి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఏడి చెన్నకేశవులు మాట్లాడుతూ 4 నెలలు దాటిన దూడల నుండి అన్ని పశువులకు డాక్టర్ల సలహాల మేరకు టీకాలు వేయించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుసేవా కేంద్రాల్లో 75 శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

జిజిహెచ్‌లో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు: ఇంజినీరింగ్ డే పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు గీతాంజలి ఇంజినీరింగ్, ఇనిస్ట్యూట్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరానికి గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి మాట్లాడుతూ ఇంజినీరింగ్ డే సందర్భంగా విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయం అన్నారు. రక్తదానం చేయడంవల్ల ప్రజల ప్రాణాలను కాపాడుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్నదృశ్యం

ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్:నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు, పంప్ స్టేషన్, డాగ్ షెడ్ తదితర ప్రాంగణాలలో పర్యటించి వాటి నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రాంగణంలోని నిరుపయోగంగా ఉన్న వాహనాలను పరిశీలించారు. వాహన పనితీరును తెలుసుకునేందుకు షెడ్డు ప్రాంగణంలో కమిషనర్ నూతన ట్రాక్టర్‌ను స్వయంగా నడిపి పరిశీలించారు.


విద్యుత్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు:విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు ,కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపించాలంటూ యూనియన్ నాయకులు ఇప్పటికే పలు మార్లు విద్యుత్ యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన కనిపించడం లేదని,ఈ పోరాటలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా జేఏసీ చైర్మన్ కొండపల్లి శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. సోమవారం నగరంలోని విద్యుత్తు భవన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ కొండపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై పలుమార్లు విద్యుత్ యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు షేక్ అల్తాఫ్ , టి. శ్రీనివాసులు, డి. దామోదర్ , వి. వెంకటేశ్వర్లు , ఎస్‌డి. రఫీ , కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి. కష్ణ, షేక్ హాజరత్ వలి, నాంచారయ్య నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘన

-చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నియమనిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయని, ఈ సమాచారం తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలోకలెక్టరేట్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ప్రయివేట్ జూనియర్ కాలేజీలు తరగతులు నిర్వహించడం ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి సమయాపాలన పాటించడం లేదంటూ జాయింట్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వెన్ను.నరేంద్ర జాయింట్ కలెక్టర్ తో మాట్లాడుతూ నగర ప్రాంతంలో ప్రయివేట్ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించి కాలేజీలు ఉదయం 8 నుండి సాయంత్రం 6:30 వరకు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు, తక్షణమే విద్యాశాఖ అధికారులు ఈ సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.. కార్యక్రమంలో సభ్యులు విష్ణు, అమర్,నాయకులు సుమంత్, కౌశిక్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

పిహెచ్‌పి వైద్య సేవలు ఎంతో అభినందనీయం

ప్రజాశక్తి-నెల్లూరు:సమాజానికి ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వైద్య సేవలు ఎంతో అవసరమని 25 వ డివిజన్ కార్పొరేటర్ నరసింహగిరి అన్నారు. సోమవారం బుజబుజనెల్లూరు లోని ఎస్సీ కాలనీ, న్యూ కాలనీ, గిరిజన కాలనీలోని ఎంపీపీ స్కూల్స్‌కాలనీలోని ఎంపీపీ ఉర్దూ స్కూల్లో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పి ఎం పి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న 25వ డివిజన్ కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి మాట్లాడుతూ పి.హెచ్.పీలు ప్రాథమిక వైద్య సేవలకే పరిమితం కాకుండా, సమాజ సేవా కార్యక్రమాల్లో చాలా ముందు ఉంటున్నారని, సమాజానికి వీరి సేవలు ఎంతో అవసరం అని అన్నారు,టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి జన్ని రమణయ్య మాట్లాడారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్మశానవాటికకు పరిష్కారం చూపండి

ప్రజాశక్తి-లింగసముద్రం: మండలంలోని మాలకొండరాయునిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ముక్తేశ్వరం గ్రామ ఎస్‌సి కాలనీ శ్మశాన వాటిక స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి చదునుచేసిన మాలకొండరాయునిపాలెం వైసిపి నాయకులు, గ్రామపంచాయతీ సర్పంచ్ ఒంటెల శ్రీనులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమ వారం తహశీల్దార్ ఎం.కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్ మంగళవారం ఆర్‌ఐ,మండల సర్వేయర్, విఆర్‌ఒలతో కలిసి ముక్తేశ్వరం గ్రామాన్ని సందర్శించి ఆక్రమణకు గురైన శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి ఎస్‌సిలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. తహశీల్దార్ ను కలిసిన వారిలో నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, గొడపేరు రత్నం, ఏసోబు, బాలయ్య, రమేష్, ఆనంద్, తదితరు లున్నారు.

17,18వ తేదీలలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-కందుకూరు:స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 17,18 వ తేదీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మం డల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ కె. సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. అథ్లె టిక్స్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, యోగా, చెస్ (చదరంగం), బ్యాడ్మింటన్ విభా గాలలో పోటీలు జరపబడునని తెలిపారు. 17న అథ్లె టిక్స్, 18న క్రీడాపోటీలు నిర్వహించిన నున్నట్లు తెలిపారు. పూర్తి వివరములకు మండల ఎస్జీఎఫ్ కోఆర్డినేటర్ ఎం నరసింహం, ఫోన్ నెంబ

ప్లాస్టిక్ కవర్లు సీజ్

ప్రజాశక్తి-కందుకూరు:పట్టణంలో సోమవారం కమిషనర్ కె అనూష ఆధ్వర్యం లో సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు ఒవి రోడ్డు లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను అమ్ముతున్న దుకాణాలపై దాడులు నిర్వహించారు. తోపుడు బండ్ల వాళ్ళ దగ్గర,హోటల్స్ లోఉన్న 120 మైక్రాన్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేయడం తో పాటు, జరిమానాలు విధించారు. ప్లాస్టిక్ కవర్లు వాడటం వల్ల కలిగే నష్టా లు గురించి షాప్ యజమానికి వివరిం చారు. 9848061214 ను సంప్రదించాలని కోరారు.

రైతులకు పంటలపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు: మండల వ్యవసాయ అధికారి ఎస్‌కె అబ్దుల్ రహీమ్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి యు గీతా మాట్లాడుతూ ఐసిఎం లో భాగంగా వేసవి లోతు దుక్కులు, విత్తన శుద్ధి, నారు శుద్ధి, సమగ్ర ఎరువుల వాడకం, జీవన ఎరువుల వాడకం, కంచె పంటలు, ఎర పంటలు, జిగురు అట్టలు, విషపు ఎర తయారీ విధానం మొద లైన వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో ఎఒ వివిఎల్ దుర్గా దేవి, టెక్నికల్ ఎఒ జి మధు, పంచాయతీ సెక్రటరీ జి జగదీశ్ బాబు, ఎంపిఇఒ బ్రహ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

నేను ఎవరి వద్ద సిఫార్సు చేయలేదు

ప్రజాశక్తి వార్తకు ఖండన

ప్రజాశక్తి - నెల్లూరు


'డిఆర్' కోసం కుర్చీలాట పేరుతో ప్రజాశక్తి దిన పత్రికలో ఆగస్టు 22న వార్త ప్రచురితమైందని, అందులో ఎలాంటి వాస్తవాలూ లేవని, తాను ఎవరి వద్ద సిఫార్సు చేయించుకోలేదని ముత్తుకూరు సబ్ రిజిస్ట్రార్ తెలిపారు. తాను ముత్తుకూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నానని, తన పేరు రాయకుండా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నానని, రాశారని పేర్కొన్నారు. సీనియార్టీ లేకుండా జిల్లా రిజిస్ట్రార్ పోస్టుల కోసం ప్రయత్నాలు చేస్తున్నానని, జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ పోస్టుకు ప్రయత్నాలు చేస్తున్నాని చెప్పారని ఇందులో ఏమాత్రమూ వాస్తవం లేదన్నారు. ఈరెండు పోస్టులకు అర్హత ఏమీ లేదని, కేవలం సీనియార్టీ ప్రాతిపదికన మాత్రమే నియమిస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగం వచ్చిం దని పేర్కొన్నారు. తాను రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేస్తున్నప్పటి నుంచి నేటి వరకు ఎలాంటి అవినీతి ఆరోపణలు గాని, ఫిర్యాదులుగాని, లేవన్నారు. తనది టిపి గూడూరు మండలం, వరిగొండ గ్రామం కాదన్నారు. జిల్లా రిజిస్ట్రార్ పోస్టుల కోసం ఎవరి వద్ద సిఫార్సు లేఖలు తీసుకోలేదని తెలిపారు. కేవలం అనుభవం ఆధారంగానే జిల్లా రిజిస్ట్రార్ పోస్టు భర్తీ చేస్తారని, ఇందులో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని, తాను చేయలేదని పేర్కొన్నారు.

రౌడీయిజాన్ని ఉపేక్షించను:ఎస్‌పి

ప్రజాశక్తి-నెల్లూరు:రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 14 జిల్లాల ఎస్‌పిలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో నెల్లూరు జిల్లాకు ఎస్‌పిగా బదిలీ అయిన అజిత వేజండ్ల సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లాకు చెందిన పలువురు పోలీసు అధికారులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు అందజేసి అభినందించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రౌడీ షీటర్స్, నేర చరిత గల నేరస్తులపై నిరంతర ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, చట్టాలకు లోబడి వ్యవహరించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ఈగల్ బృందం సమన్వయం చేసుకొని గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టుటకు తగిన చర్యలు తీసుకుటా మన్నారు. నగరంలో నేర నియంత్రణకు బీట్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని వెల్లడిం చారు. పోలీసు అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకొని పోలీసు వ్యవస్థపై ప్రజల నమ్మకం మరింత పెంపొందించే విధంగా సమర్థవం తంగా సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.విజిబుల్ పోలీసింగ్ ఉండేలా తగిన చర్యలు తీసుకుంటా మన్నారు. . శక్తి టీం వ్యవస్థను బలోపేతం చేసి మహిళల పట్ల విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిం చడంతో పాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటా మన్నారు.

రివిట్మెంట్ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-నెల్లూరు:నగర కార్పొరేషన్ పరిధిలోని 54వ డివిజన్ భగత్ సింగ్ కాలనీ వద్ద ఆగిపోయిన పెన్నా నది రివిట్మెంట్ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించాలని కోరుతూ సిపిఎం భగత్ సింగ్ కాలనీ శాఖ ఆధ్వర్యంలో జిల్లా జన వనరుల డిప్యూటీ సూపరిం టిం డెంట్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు జి నాగేశ్వర రావు మాట్లాడుతూ గత ఆరు నెలల నుండి పెన్నా నది రివిట్మెంట్ పనులు అర్ధాంతరంగా నిలిపివేశా రన్నారు. ఈ రివిట్మెంట్ నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు తీసిన గుంటల్లో పెన్నా నది నీరు నిండిపోవడంతో ప్రమా దాలకు నిలయంగా మారిపో యా యన్నారు. గతంలో రెవిట్మెంట్ కోసం తవ్విన గుంతలో ప్రమాదవశాత్తు ఇద్దరు మహిళలు పడి చనిపోయారని గుర్తు చేశారు. ఆగిపోయిన పెన్నా నది రివిట్మెంటు పనులను ప్రారంభించి త్వరిత గతిన పూర్తి చేసి ప్రమాదం నుండి భగత్ సింగ్ కాలనీ ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మూలం ప్రసాద్ ,షేక్ జాఫర్, పి రామకృష్ణ ,భగత్ సింగ్ కాలనీ నాయకులు షేక్ మస్తాన్, షేక్ మాబా ,అక్కయ్య, సుబ్బమ్మ ,సులోచన ,వసంతమ్మ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విజయవంతంగా టీచర్ల నిరసన

ప్రజాశక్తి-ఉదయగిరి : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య ఎపిటిఎఫ్ ఈ వారాన్ని నిరసన వారంగా జయప్రదంగా కొనసాగుతున్నాయని ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ హజరత్, జిల్లాశాఖ ఉపాధ్యక్షులు ఒ.శ్రీనివాసరాజు ఉదయగిరి జోన్ నాయకులు ఎండి ఖాజా పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు భవిష్యత్తులో చేపట్టనున్న ఉధృతమైన పోరాటానికి సన్నద్ధపర్చేందుకు మండలంలోని స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో ఎపిటిఎఫ్ సభ్యత్వాల నమోదులో సోమవారం పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వివిధ దశలలో ఎపిటిఎఫ్ ఆందోళన కార్యక్రమం చేపట్టిందన్నారు. నిరసన వారంలో పరాకాష్టగా 16న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఉపాధ్యాయులు భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నారని తెలిపారు. మండల శాఖ అధ్యక్షులు షేక్ షబ్బీర్ తోపాటు మండల నాయకులు ఎస్.ఓబులేసు, రామకృష్ణారెడ్డి, రజాఖ్అలీ, ఖాజాపీర్, వెంగళ్రావు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండల స్థాయిలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 18, 19 తేదీలలో ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడలు జరుగుతాయని ఎంఇఒ అనంతలక్ష్మి తెలియజేశారు. ఈ క్రీడల్లో అండర్ -14, అండర్ -17 బాల బాలికలు పాల్గొనాలన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, క్యారమ్స్, అథ్లెటిక్స్ అంశాలలో క్రీడలు జరుగుతాయని తెలిపారు. మండల స్థాయిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా అందరూ విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు.

పుల్లాయపల్లిలో 'స్పెల్ బీ' కాంపిటీషన్

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుండి 3 తరగతుల విద్యార్థులకు స్పెల్ బీ కార్యక్రమం నిర్వహించారు. అందరూ భాగంగా సోమవారం హెచ్ఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు దోహదం చేసేలా క్విజ్‌తో పాటు స్పెల్ బీ కార్యక్రమం కూడా తరచుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా ప్రధానోపాధ్యాయులు గాజులపల్లి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయిని ప్రశాంతికుమారి ఈ కార్యక్రమం ప్రారంభించారు. మొదటి ఎపిసోడ్ పూర్తయిన విజేతలకు గోల్డ్ మెడల్స్ అందజేశారు.

నాటుసారా గుట్టురట్టు..

ప్రజాశక్తి-ఉదయగిరి : దుర్గంపై గుట్టుగా సాగుతున్న నాటు సారాను పోలీస్ అటవీ శాఖ, ఎక్సైజ్ శాఖలు గుట్టురట్టు చేశారు. ఈ సందర్భంగా వారు దుర్గం అటవీప్రాంతంలో అక్రమంగా నాటుసార తయారీ చేస్తున్నారని పక్కా సమాచారంతో అక్రమ నాటుసారా కేంద్రంపై వారు దాడులు నిర్వహించారు. సుమారు 200 లీటర్ల నాటుసారాను అధికారులు గుర్తించి ధ్వంసం చేశారు. ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ, అటవీశాఖ అధికారులున్నారు.

క్రీడా పోటీలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఉదయగిరి : ఆసక్తి గల పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు అండర్-14, -17 క్రీడలలో పాల్గొనడానికి పాఠశాల యాప్లో పేర్లను నమోదు చేసుకోవాలని ఎంఇఒ టి.వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుల సంఘం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 69వ ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2025 మండల స్థాయి సెలక్షన్స్ సెప్టెంబరు 17, 18, 19వ తేదీలలో స్థానిక గవర్నమెంట్ హై స్కూల్‌లో నిర్వహిస్తామని, పాఠశాలలో విద్యార్థులు అండర్-14కు 1-01-2012 తర్వాత పుట్టిన వారు, అండర్-17 1-01-2009 తర్వాత పుట్టిన వారు ఆయా విభాగాల్లో జరుగు క్రీడలలో పాల్గొనడానికి తమ పాఠశాలల లీప్ యాప్‌లో విద్యార్థుల పేర్లు నమోదు చేసుకుని ఎంట్రీ ఫారంలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధృవీకరణతో తీసుకోవాలన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ షటిల్, యోగా, చెస్, అథ్లెటిక్స్ జరుగునన్నారు. పూర్తి వివరాలకు మండల ఎస్‌జిఎఫ్ కోఆర్డినేటర్ డివివి ప్రసాద్ 6300746554ను సంప్రదించాలన్నారు.

విద్యుత్ లైన్ పరిశీలన

ప్రజాశక్తి-జలదంకి : ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆదేశాలతో మండలంలోని అన్నవరం అరుంధతీయవాడ నివాసలపై ఏర్పాటై వున్న 11 కెవి విద్యుత్ వైరును సోమవారం ప్రజా ప్రతినిధులు, విద్యుత్ అధికారులు పరిశీలించారు. జలదంకి మండల పిఎసిఎస్ అధ్యక్షులు కరియావుల అప్పలనాయుడు, విద్యుత్ శాఖ ఎఇ సునీల్, పూనూరు భాస్కర్ రెడ్డితో కలిసి అరుంధతీయవాడను పరిశీలించారు. నివాసాలపై వెళుతున్న 11 కెవి వైరును పరిశీలించారు. కార్యక్రమంలో అన్నవరం, బ్రాహ్మణక్రాక లైన్‌మెన్లు అంకయ్య, వెంకట్రావు, మండల ఎస్‌సిసెల్ నాయకులు వేల్పుల వేణు, స్థానిక నాయకులు గోచిపాతల వెంకట కృష్ణయ్య, వేల్పుల ధనంజయ, ముచ్చాల మధుసూదన్ రెడ్డి, పూనురు వెంకట కృష్ణారెడ్డి, ఇనుకొల్లు శివకోటయ్య, మందా రమణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రేషన్ అందించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులను అందించాలని బోగోలు మండలం ముంగమూరు గ్రామానికి చెందిన సమాధి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికలాంగులకు వృద్ధులకు రేషన్ సరుకులను ఇంటి వద్దకే అందించాలని, షరతులు పెట్టినప్పటికీ మంగమూరు గ్రామంలో రేషన్ దుకాణదారులు మాత్రం పాటించడం లేదని, సెప్టెంబర్ 8న సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా తహశీల్దార్ నాసా శ్రీనివాసులు రెడ్డికి వినతి పత్రం అందజేసిన కూడా ఇంతవరకు స్పందన లేదని తెలిపారు. తన వయసు 66 సంవత్సరాలు వికలాంగుడునని ప్రభుత్వ ఉన్నత అధికారులు చొరవ తీసుకొని రేషన్ సరుకులను అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మేజర్ పంచాయతీలోని బోగోలు చెరువు దగ్గర ఉన్న స్మశాన వాటికలో గల కొంతకాలంగా చేతిపంపు బోరింగ్ చెడిపోయి ఉందని కర్మకాండలు నిర్వహించేటప్పుడు నీళ్ల లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, సమస్యను టిడిపి సీనియర్ నాయకులు బోగిరి ప్రభాకర్ అధికారుల దృష్టికి స్థానిక నాయకులు దృష్టి తీసుకుపోగా స్పందించిన బోగోలు మండల ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, స్థానిక టిడిపి నాయకులు స్పందించి సమస్యను సోమవారం పరిష్కరించారు. ఈ సందర్భంగా హిందూ శ్మశాన వాటికలో బోరు మరమ్మతులకు స్పందించిన అధిసోమవారం నాయకులకు ప్రజల కృతజ్ఞతలు తెలియజేశారు.

శరత్‌చంద్ర చటోపాధ్యాయ జయంతి

ప్రజాశక్తి-కావలి : నవలా రచయిత శరత్ చంద్ర చటోపాధ్యాయ పలువురికి ఆదర్శప్రాయుడని కావలి శాఖా గ్రంథాలయంలో 20వ శతాబ్దపు ప్రముఖ బెంగాలీ నవలా కథా రచయిత శరత్ చంద్ర చట్టోపాధ్యాయ 149వ జయంతి సందర్భంగా కావలి పట్టణంలోని వెంగళరావు నగర్ ప్రభుత్వ శాఖ గ్రంథాలయ ఆవరణంలో శాఖా గ్రంథాలయాధికారి బొమ్మల కోటేశ్వరి, నెల్లూరు జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉప గ్రంథపాలకురాలు ఎస్. సునీత, లోక్ అదాలత్ సభ్యులు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి, సచివాలయం ఉద్యోగులు, పాఠకులు శరత్ చంద్ర చటోపాధ్యాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కావలి శాఖా గ్రంథాలయ అధికారి బొమ్మల కోటేశ్వరి అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్.సునీత, యూట్యూబర్ కె రమణ, సచివాలయం ఉద్యోగులు విజయ, సుప్రజ, పాఠకులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : ముంబయి జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు నగర పంచాయతీ అధికారులు ఎట్టకేలకు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలకష్ణ, చైర్ పర్సన్ మోర్ల సుప్రజ జెసిబి యంత్రాల ద్వారా చేస్తున్న పనులను పరిశీలించారు. కాలువ పూడికతీత పనుల అనంతరం మళ్లీ యథావిధిగా ఆక్రమణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్టాంప్ వెండర్స్ ధర్నా..

ప్రజాశక్తి-కావలి : ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన రిజిస్ట్రేషన్ 2.0 విధానాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట స్టాంప్ వెండర్స్, డాక్యుమెంట్ రైటర్స్ ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ ధర్నాకు వీరు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో స్టాంప్ వెండర్ అధ్యక్షులు సి.హెచ్.వి.ఆర్. నాగరాజు కుమార్, పి.డి.వి.ఎం. ప్రసాద్ సర్రాజు శ్రీనివాసమూర్తి, షేక్. పార్థు, షేక్.గౌస్ బాషా, వెంకట్రావు, శేషయ్య, మాల్యాద్రి నాయుడు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు తొలగించండి..

ప్రజాశక్తి-జలదంకి : గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్ట్ షాపులను తొలగించాలని తెలుగుదేశం పార్టీ ఎస్‌సి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన జలదంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమ ఆవేదన వెలిబుచ్చారు. ముఖ్యంగా ఎస్‌సి ఎస్‌టి మైనార్టీ కాలనీలో వీధుల్లో సందుల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలిశాయని పేర్కొన్నారు. ఎక్సైజ్ అధికారులు పోలీసు అధికారులు బెల్ట్ షాపులను కట్టడి చేయకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు. సమావేశంలో టిడిపి మండల ఎస్‌సి నాయకులు వట్టికాల గిరిబాబు, జ్యోతి వెంకటరావు, గంధం ప్రమోద్ కుమార్, వట్టికాల చంద్రయ్య, నేలపాటి మల్లేశ్వరరావు, వట్టి కాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-మర్రిపాడు
రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని బాలుర, బాలికల వసతి గృహాలను, నందవరం మోడల్ స్కూల్, కెజిబివి స్కూల్, జవహర్ నవోదయ విద్యాలయాలను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారని తహశీల్దార్ అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ జడ్డివల ఆశ్రమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థత గురయ్యారన్నారు. నీటి కలుషితం వల్ల ఇలాంటివి జరుగుతున్నాయన్నారు. అలాగే మర్రిపాడు బాలికల వసతి గృహంలో జరుగుతున్న మరమ్మతుల పనులను పరిశీలించి కాంట్రాక్టర్లకు సూచనలు చేశామన్నారు. వసతి గృహంలోని రికార్డులను, స్టాక్ గదిలో ఉన్న బియ్యం బస్తాలను, వంట గదిని తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో హాస్టల్ సిబ్బంది లేకపోవడంతో వార్డెన్‌ను మందలించారు. సిబ్బంది అన్ని వేళలా తప్పనిసరిగా ఉండాలన్నారు. బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసే సమయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో సిబ్బందిపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గదుల్లో స్లాబ్ పెచ్చులు ఊడిపడిపోవడాన్ని పరిశీలించారు. స్నానపు గదులను, బాత్రూములను పరిశీలించగా ఉపయోగంలో ఉన్నా ఎప్పుడూ బాత్రూములకు తాళాలు వేయడంతో అక్కడ ఉన్న విద్యార్థులు బహిర్భూమికి వెళుతున్నారని తెలిపారు. బాలుర వసతి గృహంపై ఆర్డీఓకు రిపోర్ట్ చేస్తామన్నారు. వసతి గృహ వార్డెన్లు సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా పోవడం, తాగునీటిపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరిందని, కొత్త బిల్డింగ్ కావాలంటే ఏ సర్వే నెంబర్లో ఉందని అడిగారు. సర్వే నెంబర్ ఉంటున్నట్లు ఎలాంటి దాఖలాలు లేవన్నారు. పంపమని తెలిపారు. హాస్టల్ ఉంది అంటున్నారు కానీ పిల్లలు ఇక్కడ వంట వండి పిల్లలకు పెడుతున్నట్లు లేరని, వంట గది తెరిచే అర్హత ఉందన్నారు. తనిఖీ సమయంలో బాలుర వసతి గృహంలో సిబ్బంది ఎవరూలేరని ఆర్డబ్ల్యుఎస్ ఎఇ కృష్ణ ఆధ్వర్యంలో వసతి గృహాల విద్యాలయాల్లో విద్యార్థులు తాగే నీటిని టెస్టింగ్ కోసం ఆత్మకూరు ల్యాబ్‌కు పంపామన్నారు. తహశీల్దారు వెంట ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ విజయభాస్కర్, ఎంఇఒ ధనలక్ష్మి, రామకిషోర్ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని వాసిలి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో విచక్షణ రైతంగా ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయంపై మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎ నితీష్, టిడిపి రూరల్ మండల అధ్యక్షులు సుంకర పెంచలయ్య చౌదరి, గంగా పద్మయ్య, వాసిలి గ్రామ రైతులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్లను ఆధునికీకరించండి..

ప్రజాశక్తి-నెల్లూరు
నెల్లూరు రూరల్ మండలంలోని 18 గ్రామాల్లో గతంలో నిర్మించిన బస్ షెల్టర్లను వెంటనే ఆధునికీకరించాలని కోరుతూ సోమవారం సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీసులోని జెడ్‌పి సిఇఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, మండల కార్యదర్శి పుడిపర్తి. జనార్ధన్ మాట్లాడుతూ మండలంలో కొండ్లపూడి, దొంతాలి, సజ్జాపురం, కాకుపల్లి, కలివేలపాలెం గ్రామాల్లో ఉన్న షెల్టర్‌లను పడగొట్టి ఇంతవరకు పునర్ నిర్మించలేదని తెలిపారు. దాంతో బస్సులలోనూ ఆటోలలోనూ ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పొట్టేపాలెం, ములుమూడి, సౌత్ మొపూరు, కందమూరు, పాతవెల్లంటి, కొత్త వెల్లంటి, సజ్జాపురం, గొల్లకందుకూరు, గ్రామాల్లోని ప్రయాణికుల కోసం నిర్మించిన షెల్టర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరి కుక్కలకు మందు బాబులకు నిలయాలుగా మారాయని తెలియజేశారు. ప్రయాణికులు ఏమాత్రం కూర్చునేందుకు కూడా అవకాశం లేని పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. సౌత్ మోపూర్‌లో గవర్నమెంట్


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కాలేజీ, కెనరా బ్యాంక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నందువల్ల ఎక్కువ మంది ప్రయాణికులు ఈ గ్రామానికి ప్రయాణిస్తుంటారని తెలిపారు. హాస్పిటల్‌కు వచ్చే పేషెంట్లు కూడా కనీస వసతులు లేక ఇబ్బంది పడుతు న్నారు. అలాగే జొన్నవాడ రోడ్డులోని బస్‌షెల్టర్ దెబ్బతిన్నందువల్ల జొన్నవాడ కామాక్షితాయిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు ఆటోల కోసం బస్సుల కోసం ఎండలోనే నిల్చోవాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. కాబట్టి మండలంలోని దెబ్బతిన్న బస్ షెల్టర్లను వెంటనే ఆధునికీకరించి మండలంలోని ప్రజలకు అందుబాటులోకి తేవలసినదిగా సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ విజ్ఞప్తి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు శ్రీపతి దయాకర్, బద్దిపూడి వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళులు


నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం గ్రామంలోని శివాలయం సెంటర్లో సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో వడ్లపూడి నరసయ్య అధ్యక్షతన సిపిఎం అగ్రనేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకుడు గోనె దయాకర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండి ఎస్ఎఫ్ఐలో పనిచేస్తూ ఉద్యమాలపై ఆసక్తి కనపర్చినారన్నారు. ఎంతో సంపన్న కుటుంబంలో జన్మించిన ఆయన కర్షకులు కార్మికుల కోసం పార్టీలో ఎన్నో పోరాటాలు చేపట్టారన్నారు. ఉపాధి హామీ పథకం కోసం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి ఉపాధి హామీ పథకాన్ని పేద ప్రజలు అందించిన మహోన్నతమైన వ్యక్తి ఏచూరి అని ఆయన అన్నారు. ఏచూరి లేకుండా పోవడం దేశానికి దేశ ప్రజలకు తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సయ్యద్ మహబూబ్ బాషా, సహాయ కార్యదర్శి భూలోకం కాంతారావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తిరకాల దయాకర్, సిపిఎం మండల కమిటీ సభ్యులు నరసయ్య, చిట్టిబాబు, దేవకుమారి, నాగమ్మ, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

వినాయక కాలనీకి కరెంటు లైన్ వేయాలి



ప్రజాశక్తి-కావలి : ముసునూరు వినాయక కాలనీకి కరెంటు లైన్ వేయాలని అక్కడ ప్రజలు సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఈఈ కే.ఎస్. బెనర్జీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడ ప్రజలు మాట్లాడుతూ వినాయకకాలనీ ఏర్పడి, పది సంవత్సరాలు పైబడిందన్నారు. ఇప్పటి వరకు కరెంటు లైన్ వేయలేదన్నారు. సుమారు అర కిలోమీటర్ దూరం నుండి కర్రలపై వైర్లు లాక్కొని, కరెంటు వెలిగించుకుంటున్నామన్నారు. కొంతమందికి మీటర్లు ఉన్నాయని కరెంటు బిల్లులు కూడా ప్రతినెలా చెల్లిస్తున్నామని, కరెంటుస్థంబాలు వేయించి వైర్లు వేయాలని ఎన్నోసార్లు కరెంటు ఆఫీస్ చుట్టూ తిరిగామన్నారు. కరెంటు లైన్లేనందునచాలా ఇబ్బందులు గురవుతున్నామని మళ్లీ అర్జీనిచ్చి ఇబ్బందులు తెలియజేశామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, నాయకులు జి.మధుసూదన్ రావు, పి.తిరుపాలు పాల్గొని మాట్లాడారు. సమస్యను గమనించి ఎలక్ట్రికల్ అధికారులు కరెంటు లైన్లాగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానికులు ఎస్‌షాపిర, ఎస్.కె అస్మత, జి.శ్రీకాంత్ మరి కొంతమంది పాల్గొన్నారు.

శాశ్వత వసతి గృహం నిర్మించాలి

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలో బిసి కళాశాల బాలుర వసతి శాశ్వత గృహంను నిర్మించాలని సోమవారం బిసి ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షులు అద్దంకి ప్రభాకర్ రావు, బిసి ఐక్యత భవన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఉరిటి గోవిందు, ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాదరావులు సోమవారం కావలి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్‌డిఒ ఎం.సన్నీవంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి, వెనకబడిన తరగతుల కళాశాల బాలుర వసతి గృహంకు, శాశ్వత భవనంను మంజూరు చేస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ అభ్యర్థనను తగురీతిలో పరిశీలించి విద్యార్థులకు న్యాయం చేసి, వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

న్యాయశాస్త్ర కోవిదుడు పి.పి.రావు

ప్రజాశక్తి-కావలి : న్యాయశాస్త్ర కోవిదుడు, రాజ్యాంగ నిపుణులు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పద్మభూషణ్ పవని పరమేశ్వర రావు అని కావలి న్యాయస్థానం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) మృదుల తెలిపారు. కావలి పట్టణంలోని వెంగళరావు నగర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో సోమవారం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పి.పి.రావు 8వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పి.పి.రావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కావలి లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండా రెడ్డి, గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ నరేంద్ర శ్యాం సుధాకర్, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

'గండికోట'కు జాతీయ సేవా పురస్కారం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : పౌష్టికాహారం, పరిశుభ్రత, పచ్చదనంపై చైతన్యం, వృద్ధులకు అనాథలకు దుప్పట్లు, చీరల పంపిణీ, విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత, వేసవిలో విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తూ, సేవ సాహిత్యంలో తరిస్తున్న బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సామాజికవేత్త గండికోట సుధీర్ కుమార్ మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారం 2025 అందుకున్నారు. విజయవాడ అక్కినేని కళాకేంద్రంలో సోమవారం జరిగిన మదర్ సర్వీసెస్ సొసైటీ మూడవ వార్షికోత్సవంలో సినీ నటుడు పృథ్వీరాజ్, వర్తమాన నటి రజిత షాండే తదితర చేతుల మీదుగా గండికోటకు అందజేసి అభినందించారు. జాతీయ సేవా పురస్కారం అందుకున్న గండికోటను ఎంఇఒలు ఎం.దిలీప్ కుమార్, పి.వి. రత్నం, స్నేహితులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని 16వ వార్డు దివ్యాంగుల కాలనీలో వారి ప్లాట్లను ఆక్రమించి, దౌర్జన్యంగా అమ్ముకుంటున్న సకలాంగులపై చర్యలు తీసుకోవాలని టిడిపి విభిన్న ప్రతిభా వంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు, దివ్యాంగుల కాలనీ ప్రెసిడెంట్ మండవ వెంకట్రావు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కావలి ఆర్.డి.ఒ. ఎం. సన్నీ వంశీకృష్ణకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, దివ్యాంగుల కాలనీలో సర్వే నెంబర్ 831, 923లలో 16 ప్లాట్లను వి.ఆర్.ఎ.లు, వారి కుటుంబ సభ్యులు, వి.ఆర్.ఎ. వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రామయ్య కుమారుడు విజయ్, మాజీ కౌన్సిలర్ పేరం వెంకటేశ్వర్లు, గుంజి శ్రీనులు ఆక్రమించుకుని, అడిగితే దౌర్జన్యాలు చేస్తున్నారని ఆరోపించారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్ : సీజనల్ వ్యాధుల భారీ నుండి ప్రజలను కాపాడాలని ఆత్మకూరు సిపిఐ నేత జంగం నాగరాజు అన్నారు. సోమవారం సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఆర్ఐ షాజహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ టౌన్ కార్యదర్శి జంగం నాగరాజు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వలన, విష జ్వరాలు వచ్చి, ప్రజలు ఎన్నో ఇబ్బందులు గురవుతున్నారని, ఆ వ్యాధుల నివారణకై అన్ని వార్డుల పరిధిలో ఉన్న కాలువల్లో బ్లీచింగ్, క్లోరిన్, దోమల లార్వా ఉత్పత్తి కాకుండా నివారణ కోసం గుళికలు, మందు స్ప్రేలతో కాలవలు అంతట కొట్టించి వ్యాధుల భారీ నుండి ప్రజలను కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి జంగం నాగరాజు, బెల్లంకొండ హాజరత్తయ్య, ఎన్ కొండయ్య, అంకమ్మ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని పటిష్టంగా అమలుచేయాలి


ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-కావలి
కావలి డివిజన్‌లో ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ కావలి, జలదంకి, బోగోలు మండలాలకు చెందిన ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కావలి ఆర్.డి.ఒ. కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్.డి.ఒ. ఎం.సన్నీ వంశీ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజువారీ కూలి రూ.600 ఇస్తూ, సాలుకు 200 రోజులు పని కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో అధికార యంత్రాంగం బలహీన పడుతున్నారని, దానిని సరిదిద్ది, పథకాన్ని పటిష్టంగా అమలు జరపాలని కోరారు. ప్రభుత్వం రోజుకూలిని రూ.307 నిర్ణయిస్తే, ఆచరణలో రూ.150, రూ.180, రూ.200, రూ.250లు పడుతుందన్నారు. పని సమయంలో మంచినీరు, పే స్లిప్పు, గడ్డపార, చెలగపార, తట్టలు ఇప్పించాలన్నారు. జలదంకి మండలం కేశవరం, తిమ్మసముద్రం గ్రామాలలో పనులు కల్పించడం లేదన్నారు. రోజుకు 2సార్లు ఫొటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలన్నారు. కూలీలకు వారం, వారం కూలి డబ్బులు ఇప్పించాలన్నారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, సిపిఎం కావలి ప్రాంతీయ కమిటీ కన్వీనర్ గడ్డం మాల్యాద్రి, వ్య.కా.సం. మండల కార్యదర్శి మారుపూడి రాధాకృష్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సిఐటియు మండల మహాసభ



ప్రజాశక్తి-దుత్తలూరు
సిఐటియు దుత్తలూరు మండల 4వ మహాసభను దుత్తలూరు సెంటరులో నుండి ర్యాలీగా వెళ్లి సిపిఎం పార్టీ ఆఫీసు దగ్గర మహాసభ నిర్వహించారు. అందులో భాగంగా భవిష్యత్ ప్రణాళిక గురించి కార్మిక చట్టాలు అమలు, వారి డిమాండ్స్ గురించి చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ కన్వీనర్‌గా నేలటూరి. సింహాద్రి, కోకన్వీనర్‌గా శింగవరపు, విజయరామిరెడ్డి, కమిటీ సభ్యులుగా 11 మందిని ఎన్నికయ్యారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా నాయకులు సురేష్, హజరత్తయ్య, సిఐటియు మండల గౌరవాధ్యక్షులు గుజ్జుల. మల్లికార్జున, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతినిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతసాగరం
గ్రామాల్లో ఉండే స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లింగంగుంట, పాత దేవరాయపల్లి, ఆమని చిరివెళ్ల, కొత్తపల్లి, మంచాలపల్లి గ్రామ సచివాలయాల్లో ఉండే పంచాయతీ కార్యదర్శులకు స్థానిక గ్రామ సిపిఎం శాఖల ఆధ్వర్యంలో స్థానిక సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సిపిఎం శాఖ కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పారిశుధ్యం లోపం వల్ల దోమల వల్ల ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగు పరిచి విధులలో బ్లీచింగ్ చలాలని, గ్రామ పంచాయతీ సరఫరా చేసే నీళ్లను శుద్ధి చేసి సరఫరా చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో ఉండే అన్ని విధులలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజ్ ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో ఉండే అన్ని విద్యుత్ స్తంభాలకు విధి లైట్లు ఏర్పాటు చేయాలని, గ్రామంలో ఉండే అన్ని కాలనీలకు పంచాయతీ ప్రతిరోజు మంచినీటి సరఫరా చేయాలన్నారు. గ్రామంలో ఉండే వృద్ధులు, వితంతువులు, వికలాంగులను గుర్తించి కొత్త పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. సమస్యలు గ్రామాల్లో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లింగంగుంట శాఖ నాయకులు ముడిమి రాజయ్య, తిరుపాలు, పాత దేవరాయపల్లి శాఖ పార్టీ కార్యదర్శి సత్తార్, ఆమని చిరివెళ్ల పార్టీ శాఖ కార్యదర్శి షబ్బీర్, దావూద్ బాషా,కొత్తపల్లి పార్టీ శాఖ కార్యదర్శి కొండయ్య, వెంకట సుబ్బయ్య, మంచలపల్లి పార్టీ శాఖ కార్యదర్శి వెంకటేష్, సిపిఎం సభ్యులు పాల్గొన్నారు.

పొణకా కనకమ్మ వర్ధంతి



ప్రజాశక్తి-ఇందుకూరుపేట
మండలం లోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పొణకా కనకమ్మ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యులు మన్యం చంద్రశేఖర్ రెడ్డి, షేక్. అల్లాభక్షు పోణకా కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, పూలమాల సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఎ.ఆర్.వి. కమిటీ సభ్యులు ఎం.వి.రాజగోపాల్ రెడ్డి, ఆశ్రమ మేనేజర్ మనోజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి


నినాదాలు చేపడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కొడవలూరు
మండలంలోని యల్లాయపాళెం పంచాయతీలోని ఎస్‌సి, ఎస్‌టి కాలనీలలో నెలకొన్న కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో యల్లాయపాళెం సచివాలయంలో తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి మాల్యాద్రికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలోని ఎస్‌సి ఎస్‌టి కాలనీలో సమస్యలు తిష్ట వేశాయన్నారు. మంచినీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. తాగునీరు కలుషితమై ఆ నీటిని తాగితే రోగాలు బారిన పడుతున్నామని వెంటనే మంచినీరు అందించాలని వారు కోరారు. ఎస్‌సి ఎస్‌టి కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించాలని సైడ్ కాలవలు నిర్మించాలని వీధి దీపాలు ఏర్పాటు చేయాలని రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని తదితర డిమాండ్లతో కూడిన నినాదాలను సచివాలయం ఎదుట వినిపించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సయ్యద్ మహబూబ్ బాషా, సహాయ కార్యదర్శి భూలోకం కాంతారావు, సీనియర్ సిపిఎం నాయకులు గోనె దయాకర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తిరకాల దయాకర్, మండల కమిటీ సభ్యులు నరసయ్య, చిట్టిబాబు, దేవకుమారి, నాగమ్మ, శివయ్య, తదితరులున్నారు.

తాగునీటికి ఇక్కట్లు..

ప్రజాశక్తి-దగదర్తి
తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మండల పరిధిలోని తురిమెళ్ళ గిరిజన కాలనీకి చెందిన గిరిజనులు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని ఇఒపిఆర్‌డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు నెల నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యుసి ఎఇకి సమాచారం అందించినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై ధ్వజం

ప్రజాశక్తి-కావలి
కావలి ట్రంక్ రోడ్డులో శ్రీ సత్యనారాయణ స్వామి గుడి సమీపంలో గాదంశెట్టి మారుతి, నేరెళ్ల శివప్రసాద్‌లు మద్యం దుకాణం ఏర్పాటుపై మహిళలు ధ్వజమెత్తారు. సోమవారం మహిళలతో కలిసి స్థానిక విద్యాసంస్థల ప్రతినిధులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రశాంత వాతావరణంను భగ్నం చేయవద్దని ఆర్‌డిఒ వంశీకృష్ణకు, ఎక్సైజ్ శాఖకు వినతి పత్రాలు అందజేశారు. ఈ దుకాణం కావలి ఎ.ఎమ్.సి. తొలి మహిళా ఛైర్మన్ అలేఖ్య కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహించిన, నివాస ప్రాంతం కావడం గమనార్హం. తక్షణం ఈ మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని వారు కోరారు.

డాక్యుమెంట్ రైటర్లూ కార్మికులే..



ప్రజాశక్తి-ముత్తుకూరు
డాక్యుమెంట్ రైటర్లు కూడా కార్మికులే అని ముత్తుకూరు అసోసియేషన్ నాయకులు అన్నారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కార్డు ప్రైమ్ 2.0 విధానాన్ని సవరణలు చేస్తూ సులభతరం, వేగవంతంగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముత్తుకూరు మండల కేంద్రం డాక్యుమెంట్ రైటర్లు అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం ముత్తుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయినాయి. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అసోసియేషన్ నాయకులు తొండమనాటి శ్రీధర్ మాట్లాడారు. పబ్లిక్ డేటాఎంట్రీ చేసేటప్పుడు అనేక అవస్థలు పడుతున్నామని ఒకటికి, నాలుగు సార్లు ఓటీపీలు చెప్పాల్సిన పరిస్థితి క్రయ, విక్రయదారు లకు వస్తుందన్నారు. కార్డు ప్రైమ్ 2.0 విధానాన్ని డాక్యుమెంట్ రైటర్లతో పాటు కక్షిదారులు వ్యతిరేకించి నప్పటికీ ప్రభుత్వం అమల్లోకి తీసుకురావడం చాలా బాధాకరమన్నారు. 13 అంశాల పైన నిరసన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు వాసు, శివయ్య, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ తెలపండి..

ప్రజాశక్తి-కావలి
ఊరు, పేరు అడ్రస్సు వివరాలు తెలియని సుమారు 30 - 35 సంవత్సరాల వయసు గల మగవ్యక్తి తేదీ 14.09.2025న రాత్రి సుమారు 11.50 గంటల సమయంలో కావలి మండలం గౌరవరం గ్రామ సమీపంలోని నర్సరీ దగ్గర రోడ్డు దాటుతుండగా, ఆ సమయంలో ఒంగోలు వైపు నుండి నెల్లూరు వైపు పోవు ఏదో గుర్తు తెలియని వాహనం గుద్దినందున, మృతుడికి బలమైన రక్తగాయాలై, అక్కడికక్కడే చనిపోయినాడు. చనిపోయిన వ్యక్తి ఎవరో తెలిసినచో కావలి రూరల్ ఇన్స్పెక్టర్ జి.రాజేశ్వరరావుకి, ఎస్.ఐ. సిహెచ్. తిరుమలరెడ్డికి తెలియచేసి, వారిని సంప్రదించాలని కావలి రూరల్ పోలీస్ వారు కోరుతున్నారు.

వైసిపి నేతకు నల్లపరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మైపాడు గ్రామంలోని మైపాడుపాళెం నివాసి వైసిపి కార్యకర్త ఊటుకూరు నాగరాజును సోమవారం మాజీ ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పరామర్శించారు. జగన్మోహన్ రెడ్డి పర్యటనలో పోలీస్ లాఠీచార్జి ఘటనలో గాయపడిన నాగరాజును ప్రసన్నకుమార్ రెడ్డి ఆయన అనుచరులతో కలిసి పరామర్శించారు. అనంతరం మైపాడు గ్రామ సర్పంచ్ సంగం వెంకయ్య నివాసానికి చేరుకుని మైపాడు వైసిపి కార్యకర్తలతో ముచ్చటించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైసిపి రైతు విభాగ అధికార ప్రతినిధి బట్టేపాటి నరేందర్ రెడ్డి, ఎంపిటిసి కూనింగారి రమణయ్య, పామంజి శ్రీనివాసులు, షేక్ షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ నీరు సరఫరా చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బుడంగుంట వాసులు

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం బుడమగుంట గిరిజన సంఘం ప్రజలకు మున్సిపల్ నీటిని సరఫరా చేయాలని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ కుమార్‌కు సిపిఎం ఆధ్వర్యంలో అక్కడి ప్రజలు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ 17వ వార్డు బుడమగుంట గిరిజన సంఘంలో సుమారు 100 కుటుంబాల గిరిజనులు నివాసముంటున్నారని వీరందరూ నిరుపేదలని కూలి పనులు వృత్తులు చేసుకొని ఏ రోజుకారోజు పూట గడుపుకునే వారన్నారు. పది సంవత్సరాలు పైబడినప్పటికీ ఈ సంగానికి మున్సిపల్ వాటర్ సరఫరా కావడం లేదన్నారు. దానివల్ల అక్కడ ప్రజలు తాగునీటికి తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. టాంకర్ ద్వారా పోసే నీళ్ల తాగేందుకు పనికిరావని, పది సంవత్సరాల నుండి త్రాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే తగు చర్యలు చేపట్టి, అక్కడ నివాసం ఉంటున్న వారికి మున్సిపల్ నీటిని సరఫరా చేయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.మధుసూదన్‌రావు, పి.తిరుపాలు, స్థానికులు పాల్గొన్నారు.

'డిబిఎస్'లో రక్తదానం

ప్రజాశక్తి-కావలి
డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి (ఇంజనీర్స్ డే) సందర్భంగా సోమవారం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇరిగేషన్ (ఈఈ) ఖాన్, ఎలక్ట్రికల్ (ఏఈ) నాగార్జున, (ఇరిగేషన్ ఏఈ) విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఇంజనీరింగ్ డే సందర్భంగా ఈ ముగ్గురు ఇంజనీర్లను కళాశాల యాజమాన్యం వారిని సన్మానించారు. కార్యక్రమంలో డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీ రావు, డిప్లొమా కాలేజీ ప్రిన్సిపాల్ ఆర్.రమణయ్య, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దాసరి శివసాగర్ కుమార్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథ రావుపేట పంచాయతీ పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో దట్టమైన ముళ్లపదులతో ఏపుగా పెరిగి విద్యార్థులు ఆడుకొనుటకు క్రీడా మైదానం ఇబ్బందికరంగా ఉందని పాఠశాల పిఇటి నరసింహమూర్తి కోవూరుపల్లి పంచాయతీకి చెందిన 9వ క్లస్టర్ ఇన్‌ఛార్జ్, టిడిపి సీనియర్ నాయకులు, రామ్మోహన్ రెడ్డికి క్రీడామైదాన పరిస్థితిని వివరించగా వెంటనే స్పందించిన రామ్మోహన్ రెడ్డి జెసిబి సహాయంతో క్రీడా మైదానంలో ఉన్న ముల్ల చెట్లను తొలగించి విద్యార్థులు ఆడుకొనుటకు మైదానాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా దాత రామ్మోహన్ రెడ్డికి పాఠశాల అధ్యాపకులు కృతజ్ఞతలు తెలియజేశారు.